# పులిపాలు

హైదరాబాదులో అదొక పెద్ద ప్రైవేటు సంస్థ. హెడ్ ఆఫీసు ఢిల్లీలో వుంది. దాని బ్రాంచి ఆఫీసులు ప్రతి రాష్ట్ర రాజధానిలోనూ వున్నాయి.

ఆరోజు ఎం.డిగారికి వచ్చిన ఉత్తరాల్లో ఆ ఉత్తరం ప్రత్యేకంగా ఉంది. ఆ బ్రాంచి మేనేజింగు డైరెక్టరు త్యాగరాజు. వయసు యాభైఏళ్ళు. ఆయన ముఖం గంభీరంగా వుంది. లావు మీసాలు మెలితిరిగి ఉన్నాయి. అతను ఎక్స్ మిలిటరీ. స్ట్రిక్ట్‌నెస్, సిన్సియారిటీ చూసి అతన్ని అందరూ 'టైగర్‌రాజు' అని పిలుస్తారు.

ఆ ప్రత్యేక ఉత్తరం ఢిల్లీ హెడ్ ఆఫీసు నుంచి వచ్చింది. అందులోని విషయమేమిటంటే భువనేశ్వర్ బ్రాంచి మేనేజింగ్ డైరెక్టర్ భట్నాగర్ డిసెంబరు నెలాఖరులో రిటైర్ అవుతున్నాడు. జనవరిలో కొత్త మేనేజింగ్ డైరెక్టర్‌ను అక్కడికి పోస్టు చేయాలి. దానికి సరైన అభ్యర్థి ఎంపిక కోసం ఢిల్లీలోని ఛైర్మన్‌గారు తన కింద పనిచేసే డైరెక్టర్ల పనితీరు గురించి కాన్ఫిడెన్షియల్ రిపోర్టు పంపమని దేశంలోని అందరు ఎం.డి.లకు ఉత్తరాలు రాశాడు. అందరి దగ్గరి నుంచి రిపోర్టులు రాగానే వాటిని పరిశీలించి రిపోర్టు బాగున్న డైరక్టరుకు ప్రమోషన్ ఇచ్చి ఒరిస్సాలోని భువనేశ్వర్‌కు మేనేజింగ్ డైరక్టరుగా పోస్టు చేస్తాడు.

టైగర్‌రాజు దగ్గర పనిచేసే రామకృష్ణ చాలా సిన్సియర్, ఒబీడియంట్, ఇంటిలిజెంట్, నోడౌట్, ఎం.డి. కావడానికి తగిన అన్ని మంచి లక్షణాలూ అతనిలో వున్నాయి. కానీ అంత మాత్రం చేత అతన్ని గురించి వీరుడు, శూరుడు, విక్రమార్కుడు అని కాన్ఫిడెన్షియల్ రిపోర్టు, అంటే రహస్య నివేదిక రాయడానికి వీల్లేదు. ఏదైనా ఒక పరీక్ష పెట్టాలి. ఆ పరీక్షలో అతను నెగ్గాలి. అప్పుడే అతని పేరు పంపడం. టైగర్‌రాజు మెదడులో ఉపాయం తళుక్కున మెరిసింది.

వెంటనే ఇంటర్ కమ్‌లో రామకృష్ణని పిలిచాడు.

స్ప్రింగ్ డోరు తెరచుకుని లోపలికొచ్చిన రామకృష్ణ అటెన్షన్‌లో నిలబడి మిలటరీ సెల్యూట్ చేశాడు. తరువాత చెప్పండన్నట్లు వినయంగా చేతులు కట్టుకుని నిలబడ్డాడు. ఆ వినయమే ఎం.డి. గారికి ముచ్చటేస్తుంది.

"మిస్టర్ రామకృష్ణా! నాకు ఓ పావులీటరు పులిపాలు కావాలోయ్" అన్నాడు గుబురు మీసాల వెనుక చిరునవ్వు దాచుకుంటూ.

"యస్ సార్" అన్నాడు రామకృష్ణ వినయంగా. అతను ఏమాత్రం తొణకలేదు ఏమాత్రం వణకలేదు.

"మిస్టర్ రామకృష్ణా! పులిపాలు ఏ జూకో వెళ్ళి పిండుకు రాకూడదు. అడవిలో స్వేచ్ఛగా తిరిగే పులిపాలు కావాలి. అర్థమయిందా" గంభీరంగా అన్నాడు.

"అర్థమయింది సార్! అడవిలో తిరిగే పులిపాలు తెస్తాను" స్థిరంగా అన్నాడు.

"ఓ.కే. బెస్టాఫ్‌లక్, పగలు ఆఫీసు పని చూసుకుని రాత్రిపూట పులిపాలు కోసం ట్రై చెయ్యి. వారం రోజులు మాత్రమే టైమిస్తున్నాను. గో ఎహెడ్" అంటూ ధైర్యం చెప్పాడు.

తిరిగివచ్చిన రామకృష్ణ తన సీట్లో కూర్చుని ఆలోచిస్తున్నాడు. తను టైగర్‌రాజుకు భయపడడం ఒకటయితే, తను ప్రమోషన్‌కి ఆశపడడం రెండవది. భువనేశ్వర్ ఎం.డి. వచ్చే నెలాఖరుకు రిటైరవుతాడన్నది తనకు తెలుసు. దాన్ని భర్తీచేయడానికి అన్ని రాష్ట్రాలలోని డైరెక్టర్ల మీద రిపోర్టులు అడుగుతారని, అందులో రిపోర్టు బాగున్నవారిని ఆ స్థానంలో వేసుకుంటార్నదీ తనకు తెలుసు. పులిపాలు తను గనుక తెస్తే తనకు ఈ ప్రమోషన్ ఖాయమన్నది తనకు తెలుసు. కాని పులిపాలు తేవడమంటే పక్కవీధి ఫ్యాన్సీ స్టోరులో పాలబిస్కెట్లు తేవడం కాదు. ప్రాణాలను పణంగా పెట్టాలి. అయినా ఈ టైగర్ రాజు పేరుకు తగ్గట్లు టైగర్ పాలు కావాలంటున్నాడు ఎందుకో?

వెంటనే ఏదో ఆలోచన రామకృష్ణ బుర్రలో తళుక్కున మెరిసింది. ఇంటర్‌కమ్‌లో అసిస్టెంటు డైరెక్టరును తన గదికి రమ్మని పిలిచాడు.

అసిస్టెంట్ డైరెక్టర్ భజగోవిందం లోపలికి వచ్చి డైరక్టరుకు విష్‌చేసి అతనికెదురుగా కుర్చీలో కూర్చున్నాడు.

"ఏమిటోనండీ! మీకు డైరెక్టర్ ప్రమోషను త్వరలో రాబోతుందని నా మనసెందుకో పదేపదే చెబుతోంది" అన్నాడు క్యాజువల్‌గా.

"ముందు మీకు ప్రమోషను వస్తేనేగదా సార్! ఆ స్థానంలోకి నేను వచ్చేది" తెలివిగా అన్నాడు భజగోవిందం.

"సరే దాని సంగతి అలా ఉంచుగాని నాకో పావు లీటరు పులిపాలు అవసరమయ్యింది తెచ్చిపెట్టగలవా"

"ఓస్ అదెంత పనిసార్! మీరు నాకు సుపీరియర్. మీరడిగితే తేకపోవడమా? చిటికెలో తేనూ" అన్నాడు భజగోవిందం అతి తేలిగ్గా.

మంచినీళ్ళు తాగినంత తేలిగ్గా మాట చెప్పిన భజగోవిందాన్ని ఆశ్చర్యంగా చూస్తూ "పులిపాలంటే...." అన్నాడు సందిగ్ధంగా.

"నాకు తెలుసు సార్! జూలో ఉండే పులుల దగ్గరగాని, సర్కస్ కంపెనీ పులుల వద్దగాని, మరే పెంపుడు పులుల దగ్గరగాని తేకూడదు సార్! సిటీ నుంచి ఎటు వైపు మూడు గంటలు ప్రయాణం చేసినా ఫారెస్టు తగులుతుంది. ఫారెస్టులో మాటువేసి పిల్లల పులిని పట్టుకొని పాలుపిండుకొని తెస్తాను. మా తాతముత్తాతలు పులుల్ని, సింహాల్ని వేటాడిన వాళ్లు. ఆ రక్తం నాలో యింకా వుంది సార్! పులులు నాదగ్గర పిల్లుల్లా పడుంటాయి సార్!" బడాయిలు పలికాడు భజగోవిందం.

"గుడ్! ఇక మీరెళ్ళొచ్చు. టైము వారం రోజులు మాత్రమే!" హెచ్చరించాడు రామకృష్ణ.

భజగోవిందం అలాగేనంటూ తల వూపి నేరుగా వెళ్లి తన సీట్లో కూర్చున్నాడు. అడిగేవాడికి చెప్పేవాడెప్పుడూ లోకువే కాబట్టి బజర్‌నొక్కి సెక్షనాఫీసర్ని తనగదిలోకి పిలిపించాడు.

విష్‌చేసిన సెక్షను ఆఫీసరు నీలకంఠం నిలబడే అడిగాడు "చెప్పండి సార్. పనేమిటో"

"నాకు పావులీటరు పులిపాలు కావాలోయ్"

"ఇప్పుడే తెమ్మంటారా! రేపు తెచ్చినా పరవాలేదా"

"అర్థమయిందా! నేనడిగింది పులిపాలు"

"అర్థమయింది సార్! నేను తెస్తానన్నదీ పులిపాలే" ఇంకాగట్టిగా అన్నాడు నీలకంఠం.

నీలకంఠం నందిని పందిని, పందిని నందిని చేయగల సమర్థుడని భజగోవిందానికి తెలుసు. ఈ పని నిజంగా కూడా సాధించుకు వచ్చినా ఆశ్చర్యపడనవసరం లేదు అనుకుని ఇక ఎక్కువ విషయాన్ని సాగదీయకుండా ఎలాంటి పులి దగ్గర పాలు తీసుకు రావలసిందీ వివరించి చెప్పి వారం రోజులు టైమిచ్చాడు. 'అలాగే సార్' అంటూ సెలవు తీసుకుని వెళ్ళాడు నీలకంఠం.

తన సెక్షనుకు వెళ్ళిన సెక్షనాఫీసరు, "బోరుకొడుతుంది అలా క్యాంటీనుకు వెళ్ళి టీ తాగొద్దాం రావోయ్" అని చెవిలో పుల్లపెట్టి ఏకాగ్రతతో గెలుక్కుంటున్న అసిస్టెంటు సెక్షను ఆఫీసరు పుల్లయ్యను పిలిచాడు.

పుల్లయ్య చెవిలో పుల్లని అలాగే వుంచి నీలకంఠం వెంట బయలు దేరాడు. ఇద్దరూ క్యాంటీన్‌కి వెళ్ళారు. టీ తాగారు. బిల్లు తనే ఇచ్చిన నీలకంఠం, "నీతో ఒక పనిపడింది పుల్లయ్యా! నా అభిమాన శిష్యుడివి కాబట్టి నీవు కాబట్టి చెబుతున్నాను" అన్నాడు.

అతను మాట పూర్తి చేయగానే "పులిపాలు పావు లీటరు వారం రోజుల్లో తెచ్చి మీకివ్వాలి అంతేగదా!" అన్నాడు వెంటనే పుల్లయ్య.

"ఇదెప్పటినుంచోయ్! నీకు జ్యోతిష్యం కూడా వచ్చున్నమాట" ఆశ్చర్యంగా అడిగాడు నీలకంఠం.

"జ్యోతిష్యం కాదు సార్! ఇందాక నా పుల్లల పెట్టి కనిపించకపోతే అడుగుదామని మీ రూము కొస్తే మీరు లేరు. అసిస్టెంటు డైరక్టరు గదికి వెళ్ళారని తెలిసింది. అక్కడి కొచ్చి కిటికీలోంచి అంతా విన్నాను. ఏమను కోకండి"

"ఏమనుకోను గానీ, ఇంతకూ ఏమంటావ్?"

"ఏమనేదేముంది ఇక మీరా విషయం మరిచిపోండి"

"మరిచిపోతే ఎలాగోయ్! పావు లీటరు పులిపాలు లేకపోతే నా ప్రమోషన్"

"మిమ్మల్ని మరిచిపొమన్నది మీ ప్రమోషన్ సంగతి కాదు, పులిపాల సంగతి. వారం రోజుల్లో తెల్లవారు జాము తెచ్చే పాలప్యాకెట్‌లా మీ టేబుల్ మీద వుంటుంది పులిప్యాకెట్" భరోసా ఇచ్చాడు పుల్లయ్య.

ఇద్దరూ వచ్చి ఎవరి సీట్లలో వాళ్ళు కూర్చున్నారు.

ఇంతలో పుల్లయ్య దగ్గరకు వచ్చాడు అటెండరు ఆదెయ్య.

"సార్ మా అబ్బాయికి అటెండరు ఉద్యోగం ఇప్పించమని అడుగుతున్నాను. సెక్షన్ ఆఫీసరు గారితో మాట్లాడారా సార్!" అడిగాడు ఆదెయ్య చేతులు కట్టుకుని.

"కొత్త అటెండరు ఉద్యోగాలు ఎక్కడున్నాయోయ్? కాకపోతే...."

"మార్గముంటే చెప్పండి సార్" ప్రాధేయపడ్డాడు ఆదెయ్య.

"నేను చెప్పిన పని ఒకటి చేశావంటే నాకు ప్రమోషన్ వస్తుంది. నువ్వు గ్రాడ్యుయేట్‌వి, పాతికేళ్ల సర్వీసు ఉందికాబట్టి నిన్ను నాస్థానంలో వేస్తారు. దాంతో నీ స్థానం ఖాళీ. దాంట్లో నీ కొడుకుని అటెండురుగా వేసుకుందాం. పూచీ నాది"

"ఈ పద్ధతి చాలా బాగుంది సార్! ఏం చెయ్యమంటారో చెప్పండి. ప్రాణమయినా ఇస్తా..........."

"ప్రాణాలు అవసరం లేదుకాని, పావు లీటరు పులిపాలు తెచ్చియ్యి చాలు"

ఆ మాట విని వణికిపోయాడు ఆదెయ్య.

"మరి పిల్లాడికి ఉద్యోగం ఎలా వస్తుందోయ్" అంటూ తన ఫైల్లో తల దూర్చాడు పుల్లయ్య.

ఒకే ఒక్క నిముషంలో ఒక నిర్ణయానికి వచ్చిన ఆదెయ్య పులిపాలు తెస్తానని ఒట్టు పెట్టుకుని చెప్పి దానికి సబంధించిన రూల్స్ అండ్ కండిషన్స్ చెప్పించుకుని మరీ విన్నాడు.

వారం రోజులు గడిచిపోయాయి. ఎవరికి వారు రహస్యంగా తన బాధ్యతలను కింద వారి మీదికి నెట్టి నిశ్చితంగా వున్నారు.

అటెండరు ఆదెయ్య మొదటి నుంచి ఏ ప్రయత్నమూ చేయలేదు. 'బిచ్చమెయ్యకపోతే పోయావు, కుక్కను కట్టేయ' మన్నట్లు పిల్లవాడికి ఉద్యోగం రాకపోతే పోయింది. ప్రాణాలెక్కడ పోగొట్టుకొనేది అని ఒక నిర్ణయానికి వచ్చి వున్నాడు. ఆ రోజే ఆఖరి రోజు. ఆ ఉదయం కుక్కి మంచంమీద వెల్లికిలా పడుకొని కప్పువంక చూస్తూ పిల్లవాడి భవిష్యత్తు గురించి ఆలోచిస్తున్నాడు. ఇంతలో అతని కంటికి ఒక దృశ్యం కనిపించింది. గోడమీద పిల్లి తన పిల్లలు వెంటరాగా నెమ్మదిగా వెళుతూవుంది. వెంటనే ఆదెయ్య మెదడులో ఒక ఆలోచన తళుక్కున మెరిసింది. పిల్లి కూడా పులి జాతికి చెందిందే. దాన్ని సెవన్టీ ఎం.ఎం.లో బ్లో అప్‌చేస్తే అచ్చం పులిలాగే వుంటుంది. అటువంటిది పిల్లిపాలు తీసుకువెళ్ళి పులిపాలంటే చూడబొయ్యేదెవరు? అనుకున్నాడు.

ఇంట్లో ఎవరూ లేరు, తలా ఒక పనిమీద ఉన్నారు బయట. ఇదే సమయమనుకుని చిన్న గిన్నెలో పాలు పోసుకుని వచ్చి పిలిచాడు. పెంపుడు పిల్లి గనుక వెంటనే వచ్చింది. పిల్లి పాలు తాగుతుంటే వెళ్ళి తలుపులు వేసి వచ్చాడు. వెంటనే చిన్న చెంబు తెచ్చి నిండుగా వున్న దాని పాలిండ్లు పట్టుకొని పాలు పితకసాగాడు. గదిలో పెట్టి కొడితే పిల్లి కూడా పులిలా మారుతుందన్నట్లు ఆ పిల్లి భయంతో ఆదెయ్య ముఖమంతా తన వాడి గోళ్ళతో రక్కింది. వళ్ళంతా గీకింది. అయినా తన పని అయ్యేంత వరకు వదల్లేదు ఆదెయ్య.

తనకు అవసరమైన పాలొచ్చాయనుకున్న తరువాతనే దాన్ని వదిలేశాడు. 'వెన్నతిన్న వాడు వెళ్లిపోతే చల్లతాగిన వాడిని చావమోదినట్లు' ఆ అసిస్టెంటు సెక్షను ఆఫీసరు చల్లగా ఫానుకింద కూర్చొని తనను పిల్లి చేత కరిపించాడు అనుకున్నాడు. తరువాత తను పిండిన పాలను సీసాలో పోసి మూతపెట్టాడు. తరువాత వంటిమీద గాయాలు ఏమీ తుడుచుకోకుండా నేరుగా ఆఫీసుకు వెళ్ళాడు.

పదిగంటలకు ఆఫీసుంటే తొమ్మిది గంటలకే ఆఫీసుకు వచ్చి ఆదెయ్యకోసం ఎదురుచూస్తూ కూర్చొని ఉన్నాడు పుల్లయ్య. ముఖమంతా గీక్కుపోయి, వళ్ళంతా రక్తపు గాయాలతో చేతిలో పాలసీసాతో వచ్చిన ఆదెయ్యను చూడగానే అతని చేతిలోని సీసాను అప్యాయంగా అందుకుని, "భేష్ ఆదెయ్యా సాధించావు" అంటూ మెచ్చుకున్నాడు.

"సార్ పులిని పట్టుకోవడానికి ఎంత కష్ట పడ్డాను. దానికోసం రాత్రుళ్ళు వెళ్ళి చెట్లమీద మకాం వేశాను. చివరికి ఈరోజు ఉదయం పులి ఆరుగంటల ప్రాంతంలో పిల్లలకు పాలివ్వడానికి వచ్చింది. చప్పున దూకి దానితో హోరాహోరీగా పోరాడి ప్రాణాలకు తెగించి మీరు అడిగిన పాలు తెచ్చాను సార్" అయాసపడిపోయాడు ఆదెయ్య.

"ఆదెయ్యా! నువ్వు వెంటనే వెళ్ళి గాయాలకు కట్టుకట్టించుకో" అంటూ జేబులోంచి వంద రూపాయల నోటు తీసి ఇచ్చాడు పుల్లయ్య. కుంటుకుంటూ బయటకు వెళ్ళిపోయాడు ఆదెయ్య.

శంఖంలో పోస్తేగాని తీర్థం కాదన్నట్లు తన బీరువాలో ఉన్న ఖాళీ అట్టప్యాకెట్ తీసి ఆసీసాను ఆ అట్టపెట్టిలో పెట్టి అందంగా ప్యాక్ చేశాడు అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ పుల్లయ్య. దాన్ని తీసుకుని నేరుగా సెక్షన్ ఆఫీసరు రూముకు వెళ్ళాడు.

"మైగాడ్, పులిపాలు తెచ్చావా! నాజన్మ తరించిపోయింది పుల్లయ్యా" అంటూ పుల్లయ్యను ఆప్యాయంగా కౌగిలించుకున్నాడు నీలకంఠం.

"సార్! అంత తేలిగ్గా దొరికాయనుకుంటున్నారా! కన్ను పొడుచుకున్నా కానరాని కారడవిలో అరడజను మంది మనుషుల్ని తీసుకెళ్ళి గుహలో పాలిస్తున్న బాలింత పులిని బంధించి పాలు పిండుకొని తెచ్చాను. వెయ్యి రూపాయలు ఖర్చయింది."

"ఖర్చయితే అయింది. నీకు ప్రమోషన్ వచ్చేసినట్లే. వెళ్ళి ఆనందంగా పనిచేసుకో" అన్నాడు నీలకంఠం.

పుల్లయ్య అటు వెళ్ళగానే అదే ప్యాకెట్‌ను తన శైలిలో రంగురంగుల కాగితాలతో మళ్ళీ ప్యాక్ చేశాడు. వెంటనే దాన్ని తీసుకుని అసిస్టెంటు డైరక్టరు భజగోవిందం దగ్గరకు వెళ్ళాడు.

తన చేతిలో వున్న రంగురంగుల ప్యాకెట్ వైపు ఆశగా చూస్తున్న భజగోవిందంతో "చెప్పానుగదా సార్! పులిపాలు తేవడం చిటికెలో పని అని. అన్నాను, తెచ్చాను" అంటూ గర్వంగా చూశాడు.

నీలకంఠం నుంచి ఆ ప్యాకెట్ అందుకుని "గుడ్ మిస్టర్ నీలకంఠం, నీ మేలు మరిచిపోను. రాబోయే ప్రమోషన్ కోసం ఎదురు చూస్తూండు" అంటూ షేక్‌హాండ్ ఇచ్చి నీలకంఠాన్ని సాగనంపాడు భజగోవిందం.

తరువాత ఆ ప్యాకెట్‌ని మరింత అందంగా మళ్లీ గిఫ్ట్ పేపరుతో ప్యాక్ చేశాడు భజగోవిందం. దానికి అన్ని మూలలా తళతళలాడే మెరుగు కాగితాలు అంటించాడు. దానిమీద టైగర్ మిల్క్ అని అందమైన అక్షరాలు రాశాడు. దాన్ని ఒకట్రేలో పెట్టుకుని డైరక్టరు రామకృష్ణ గదిలోకి వెళ్ళాడు.

"సార్ చెప్పానుగా, మా కుటుంబం గురించి, మాది టైగర్స్‌ని వేటాడే 'టైగర్ ఫ్యామిలీ' అని. నాలుగడుగుల ఎత్తు, ఆరడుగుల పొడవు వున్న ఆడ పులిని పిల్లిని చేశాను. పిల్లల్ని పక్కనే చెట్టుకు కట్టేసి శుభ్రంగా నాలుగు లీటర్ల పాలు పిండాను. ఇంట్లో మూడూముప్పావు లీటర్లు ఇచ్చి, మీరు చెప్పిన పావు లీటరు పాలు మాత్రమే తెచ్చాను" అంటూ ట్రేను గౌరవంగా రామకృష్ణ టేబులు మీద పెట్టాడు.

"గుడ్ మిస్టర్ భజగోవిందం, ఇచ్చిన టైములో చెప్పిన ప్రకారము తెచ్చావు. గాడ్‌బ్లెస్‌యూ"

రామకృష్ణ మాటలకు గర్వంగా తల ఒకసారి ఎగరేసి సంతోషంగా బయటికి వెళ్ళిపోయాడు భజగోవిందం.

డైరక్టర్ రామకృష్ణ వెంటనే టేబుల్‌మీద ప్లేటులో ఉన్న టైగర్‌మిల్క్ ప్యాకెట్‌మీద ఒక గ్రీన్ కలర్ వెల్వెట్ క్లాత్ కప్పి, ఎం.డి. గారి గదిలోకి తనే స్వయంగా తీసుకెళ్ళి వినయంగా నిలబడ్డాడు.

క్యాలెండరులో రౌండ్‌చేసిన డేటు వైపుచూసిన ఎం.డిగారు "పులిపాలు కదూ! అక్కడ పెట్టి వెళ్ళు" అన్నాడు గంభీరంగా.

రామకృష్ణ అదే విధంగా టేబులు మీద ఆ ట్రే పెట్టి వెళ్లగానే బజర్‌నొక్కాడు, ఎం.డి.

ఒక పై అధికారి ఎంత పెద్ద పనిచెప్పినా కుంటిసాకులు చెప్పకుండా 'యస్' అని పాజిటివ్ రిప్లై ఇవ్వడం ఒక మంచి సబార్డినేట్ లక్షణం. 'యస్' అంటే సగం పని అయినట్లే. అవి ఏపాలయినా తనకనవసరం. రామకృష్ణ పరీక్షలో నెగ్గాడు అనుకొన్నాడు త్యాగరాజు, అదే టైగర్‌రాజు.

ముఖం మీద, చేతులమీద ప్లాస్టర్లతో తన బజర్ విని లోపలికి వచ్చిన అటెండరు ఆదెయ్యతో "ఆ ప్లేటులోని ప్యాకెట్ తీసుకెళ్ళి ఎవరూ చూడకుండా చెత్తకుండీలో పారెయ్" అన్నాడు.

"చిత్తం" అంటూ ఆ ట్రేని అక్కడి నుంచి తీసుకు వెళ్లాడు అటెండరు ఆదెయ్య.

ఈ అంశానికి ఇదే కొసమెరుపు అని ఎం.డి. గారు అనుకుంటే, ఇది వెళ్ళాల్సిన చోటు అదే అనుకున్నాడు అటెండరు ఆదెయ్య ✸

**(విపుల మంత్లీ, సెప్టెంబరు, 2001)**